క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



సుద్దమల్ల లక్ష్మీనరసింహ కంబగిరి స్వామి ఆలయంలో భక్తులకు హారతిస్తున్న అర్చకులు

ఉయ్యాలవాడ: మండలంలోని సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, అభయాంజనేయస్వామి, లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు వేకువజామునే ప్రత్యేక అభిషేకాలు, సామూహిక కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు లక్ష్మణస్వామి, కమలేష్‌శర్మ, అనంతయ్య, భాస్కరశర్మలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులతో నిర్వాహకులు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆవరణలో రెండో రోజు జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించగా, కర్నూలు రాయలసీమ యూనివర్సిటీ డిగ్రీ కళాశాల విద్యార్థులు రెండో స్థానం సాధించారని రామకృష్ణారెడ్డి శనివారం తెలిపారు. పోటీల్లో 9 కాలేజీల జట్లు పాల్గొన్నాయన్నారు. షటిల్ బ్యాడ్మింటన్ సెక్రటరీ శివకిశోర్ మాట్లాడారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

నంద్యాల(అర్బన్): పట్టణ శివారులోని వైఎస్సార్‌నగర్, నందమూరినగర్, ఆటోనగర్ ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్ శనివారం పూజ భూమి పూజ చేశారు. దాదాపు రూ.75 లక్షల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులకు చేపట్టిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, మెప్మా పీడీ వెంకటదాసు తదితరులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ సీసీ రోడ్లతో పాటు డ్రైనేజీల ఏర్పాటును చేపడుతున్నామని చెప్పారు.

ఐకమత్యంతోనే అభివృద్ధి



బిషప్ సంతోష్ ప్రసన్నరావును ఊరేగిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఐకమత్యంతోనే సంఘాలు, కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని నంద్యాల డయాసిస్ అధ్యక్షుడు బిషప్ రైట్ రెవరెండ్ సంతోష్ ప్రసన్నరావు అన్నారు. శనివారం స్థానిక టెక్కెలోని పాస్టరేట్-5 క్రీస్తు ఆలయం 22వ ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాస్టరేట్-5 చైర్మన్ సుమిత్ర కుమార్, సెక్రటరీ బాలచంద్రుడు కార్యక్రమానికి అధ్యక్షతన వహించారు. ముందుగా టెక్కె నుంచి బిషప్ దంపతులను ఊరేగింపుగా చర్చికి తీసుకొచ్చారు. ఆలయ ప్రదక్షిణ నిర్వహించి ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమం నిర్వహించారు. స్త్రీల మైత్రి సంఘం సభ్యులు ప్రత్యేక గీతాలను ఆలపించారు. కమిటీ సభ్యులు విల్సన్, ప్రభుదాసు, సుధాకర్, ఏసురత్నం, మధుసూదన్‌బాబు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

నంద్యాల(అర్బన్): ఈనెల 25వ తేదీన స్థానిక మున్సిపల్ టౌన్‌హాల్‌లో జరిగే మాదిగల ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ మహాసభకు తరలి వచ్చి విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం ముఖ్యనాయకులతో కలిసి విజయోత్సవ సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ద్వారా ఎస్సీ వర్గీకరణను సాధించుకున్నామన్నారు. టౌన్‌హాల్‌లో జరిగే విజయోత్సవ సభకు రాష్ట్ర మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు రామాంజనేయులు,బండారు శ్రావణి, ఎంఎస్ రాజు, గిత్తా జయసూర్య, బొగ్గుల దస్తగిరి పాల్గొంటారని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు కోటేష్ మాదిగ, మహిళా నాయకురాలు రాధమ్మ పాల్గొన్నారు.

సుబ్బరాయుడు మృతి తీరనిలోటు

నంద్యాల(న్యూటౌన్): విశ్రాంత డిప్యూటీ ఇంజనీర్ సుబ్బరాయుడు మృతి రాయలసీమకు తీరని లోటు అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు అన్నారు. శనివారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో కేసీ కెనాల్, శ్రీశైలం, కుడిబ్రాంచ్ కాల్వ, తెలుగుగంగ ప్రాజెక్టు పరిధిలో ఇంజినీర్‌గా అంకిత భావంతో పని చేశారన్నారు. రాయలసీమ ప్రాజెక్టుల సాధనే లక్ష్యంగా నిర్విరామంగా కృషి చేశారని కొనియాడారు. సీపీఐ కార్యదర్శి నారాయణ, సహాయ కార్యదర్శి రామ్మోహన్ ఉన్నారు.

కార్తీక పూజలకు వేళాయె!

- పూజలందుకునేందుకు రుద్రకోటేశ్వరుడు సన్నద్ధం
- ఈనెల 22 నుంచి వచ్చే నెల 22 వరకు కార్తీక మాస పూజలు
- నవంబర్ 5న లక్ష దీపోత్సవం
- ఏర్పాట్లలో నిర్వాహకులు నిమగ్నం



రుద్రకోడూరు పుణ్యక్షేత్రం

ఆత్మకూరు: నల్లమల అభయారణ్యంలో అత్యంత ప్రాచీనమైన రుద్రకోడూరు పుణ్యక్షేత్రం కార్తీకమాస పూజలకు సిద్ధమైంది. ఈనెల 22 నుంచి నవంబర్ 22వ తేదీ వరకు కార్తీకమాస వేడుకలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కార్తీకమాసంలోని నాలుగు సోమవారాలు రుద్రాణి, రుద్రకోటేశ్వరస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ పురోహితులు నల్లబోతుల నారాయణ తెలిపారు. ప్రతిరోజూ వేకువజామున 4 గంటలకు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించనున్నామన్నారు. రుద్రాణి మాతకు కుంకుమార్చనలు, అలంకార పూజలు ఉంటాయన్నారు. నవంబర్ 5న కార్తీక పౌర్ణమి సందర్భంగా లక్ష దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నామన్నారు. 6న క్షేత్రంలో శివపార్వతుల కల్యాణం, సత్యనారాయణవ్రతం కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పురోహితులు తెలిపారు.

క్షేత్ర చరిత్ర..

నల్లమల అటవీ పరిధిలోని రుద్రకోడు క్షేత్రం అతి పురాతనమైనది. వందల ఏళ్ల క్రితమే వెలసిన ఈ క్షేత్రంలో క్షేత్రంలో మహాశివుడు కైలాసంలో పార్వతీదేవితో స్వల్పవిషయంపై అలిగి భూలోకానికి వచ్చే సమయంలో స్వయంభూ లింగాకారంగా అవతరించారని, స్కాందపురాణం తెలుపుతోంది. ఇక్కడ బ్రహ్మతో సహా ముక్కోటి దేవతలు రుద్రుడైన మహాశివుడిని శాంతింపజేసేందుకు తరలివచ్చినట్లు తెలుస్తోంది. ఎంతో ప్రాచుర్యం కలిగిన ఈ క్షేత్రంలో రుసులు, మహాయోగులు పూజలు చేశారు. ప్రస్తుతం క్షేత్రంలో ఒకేరోజు సంగమేశ్వరం నుంచి శ్రీశైల క్షేత్రం, శ్రీశైలం నుంచి రుద్రకోడు క్షేత్రాన్ని సందర్శిస్తే సకల పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం.

జ్యోతి దర్శనం ప్రత్యేకం

శబరిమలైలోని అయ్యప్పస్వామి ఆలయంలో మకర సంక్రాంతి సందర్భంగా జ్యోతి దర్శనం లాగే రుద్రకోడూరు క్షేత్రంలో ఏటా కార్తీకమాసం పౌర్ణమి రోజున జ్యోతి దర్శనమివ్వడం ప్రత్యేకత. జ్యోతి దర్శనం ఓ మహాభాగ్యంగా భక్తులు భావించి పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. శివస్వాములు, అయ్యప్పస్వాములు, భక్తులు కూడా రుద్రకోడూరు క్షేత్రంలో కార్తీకమాసంలో జరిగే లక్ష దీపారాధన కార్యక్రమంలో పాల్గొంటారు.

ఇలా చేరుకోవచ్చు.

రుద్రకోడూరు మహాక్షేత్రానికి ఆత్మకూరు నుంచి నల్లకాల్వకు వెళ్లి అక్కడి నుంచి రుద్రకోడూరు క్షేత్రం చేరుకోవచ్చు. ఆత్మకూరు నుంచి నల్లకాల్వ 5 కి.మీ., నల్లకాల్వ నుంచి రుద్రకోడూరు క్షేత్రం 14 కి.మీ. దూరం ఉంది. మోటార్ బైక్, ట్రాక్టర్ల ద్వారా ఈ క్షేత్రానికి భక్తులు చేరుకోవచ్చు.

కార్తీక పూజలకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఈఓ శ్రీనివాసరెడ్డి

మహానంది: ఈనెల 22 నుంచి నవంబరు 20 వరకు నిర్వహించనున్న కార్తీకమాస పూజలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయనున్నట్లు మహానంది ఆలయ ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. దేవస్థాన కార్యాలయంలో శనివారం ఈఓ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వేకువజామున 4.30 గంటల నుంచే స్వామిఅమ్మవార్లకు మహామంగళహారతుల అనంతరం దర్శనాలు ప్రారంభమవుతాయన్నారు. రాత్రి 10 నుంచి 10.30గంటల వరకు కామేశ్వరీదేవి మహానందీశ్వరస్వామివార్లకు ఏకాంతసేవ పూజలు ఉంటాయన్నారు. నవంబరు 5న కార్తీకపౌర్ణమి సందర్భంగా కోటిదీపోత్సవం, 18న లక్షబిల్వార్చన, 19న లక్షకుంకుమార్చన పూజలు ఉంటాయన్నారు. గర్భిణులు, చిన్నపిల్లలు ఉన్నవారితో పాటు వికలాంగులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో ఏఈఓ వై.మధు, ఆలయ సూపరింటెండెంట్లు శశిధర్‌రెడ్డి, నీలకంఠరాజు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై సోలార్ ఏర్పాటు చేయాలి



చాపిరేవులలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): థర్మల్ విద్యుత్ ద్వారా భూతాపం పెరుగుతుందని, పర్యావరణ హితమైన సోలార్ పలకలను ఇళ్లపై ఏర్పాటు ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ శాఖ నంద్యాల డివిజన్ ఈఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌లో భాగంగా పునరుత్పాదక రంగానికి కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ ద్వారా సబ్సిడీ ఇస్తుందని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా మండలంలోని చాపిరేవుల గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈఈ మాట్లాడుతూ గతంలో సోలార్ సిస్టమ్‌కు 12 శాతం జీఎస్టీ ఉండేదని, ప్రస్తుతం 5 శాతానికి తగ్గించారన్నారు. డీఈఓ జనార్ధన్‌రెడ్డి, ఎంపీడీఓ సుగుణశ్రీ, ఏఈ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవనంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్, ఈఈ శ్రీనివాసరెడ్డితో పాటు ఏఈలు రవికుమార్, రామయ్య, రవికుమార్, నాగరాజు పాల్గొన్నారు.

బ్యాంకుల విలీనంతో ఖాతాదారుల ఇక్కట్లు



ఆన్‌లైన్ సేవలు నిలిచిపోవడంతో వేచి ఉన్న ఖాతాదారులు

చాగలమర్రి: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొన్ని చిన్న బ్యాంకులను విలీనం చేసింది. దీంతో ఏపీజీబీ చాగలమర్రి శాఖలో 5 రోజులుగా ఖాతాదారుల లావాదేవీలు స్తంభించిపోయాయి. రాష్ట్రంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, ఆర్థప్రగతి గ్రామీణ వికాస్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకులను రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా విలీనం చేసే ప్రక్రియను ఈ ఏడాది మే 1 నుంచి ప్రారంభించింది. ఆయా బ్యాంకులకు సంబంధించిన ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్ పునరుద్ధరణలో భాగంగా 5 రోజుల నుంచి ఖాతాదారుల లావాదేవీలను ఏపీజీబీ అధికారులు నిలిపివేశారు. దీంతో ఖాతాదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆన్‌లైన్ సేవలు స్తంభించడంతో యూపీఐ, ఫోన్‌పే, గూగుల్ పే అకౌంట్లు పని చేయకపోవడంతో ఖాతాదారులు లబోదిబోమంటున్నారు. నాలుగు బ్యాంకుల విలీనం అనంతరం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా కొత్త పేరును ఏర్పాటు చేశారు. బ్యాంకు సీఐఎఫ్ నెంబరు మారడంతో ఆయా బ్యాంకులకు సంబంధించిన ఖాతాల యూపీఐ ట్రాన్సాక్షన్స్ నిలిచిపోవడంతో ఖాతాదారులు బ్యాంకు కార్యాలయానికి పరుగులు తీస్తున్నారు. అత్యవసరమైన ఖాతాదారులు డబ్బు తీసుకోవడానికి వస్తే సర్వర్ డౌన్ కావడంతో ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయి గంటల తరబడి అక్కడే వేచిచూడాల్సిన దుస్థితి ఏర్పడింది. బ్యాంకు ఉన్నత అధికారులు చొరవ చూపి సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ త్వరితగతిన పూర్తి చేసి ఖాతాదారుల ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.

ధన్వంతరి జయంతి

నంద్యాల(వ్యవసాయం): స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని శ్రీత్యాగరాజ స్వామి ఆలయంలో శనివారం ధన్వంతరి జయంతిని పట్టణ నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉమ్మడి జిల్లా నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ విజయకుమార్, ఆలయ గౌరవాధ్యక్షుడు మల్లుగాళ్ల సుబ్బరాయుడు పాల్గొన్నారు. ముందుగా.. ధన్వంతరి స్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చనలు, హోమాలు జరిపించారు. అనంతరం ఆయూష్ శాఖ ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు ఉచితంగా ఆయుర్వేద మందులు అందజేశారు. వైద్యులు యశోదర, సుబ్రహ్మణ్యం, నాగరాజు, మద్దయ్య, శీనయ్య, పుల్లయ్య, శ్రీనివాసులు, తిరుపతయ్య పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి ప్రదోషకాల అభిషేకం



నందీశ్వరుడికి అభిషేకం చేస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన మహానందీశ్వర స్వామికి శనివారం ఆలయ ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకరఅవధాని, ఆలయ ముఖ్య అర్చకులు రాజమాణిక్యశర్మ ప్రదోషకాలంలో అభిషేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల భక్తులు ప్రత్యక్ష, పరోక్ష సేవల ద్వారా పూజల్లో పాల్గొన్నారు. అలాగే యాగశాలలో నవగ్రహ, మృత్యుంజయ, ధన్వంతరి హోమాలు వైభవంగా నిర్వహించారు.

నందీశ్వరస్వామికి పరోక్షసేవ



శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. శనివారం 36 మంది భక్తులు పరోక్షసేవగా నందీశ్వరస్వామికి విశేష పూజను జరిపించుకున్నారు. ఆరంభ పూజల్లో భాగంగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజను చేశారు. అనంతరం పంచామృతాలు, ఫలోదకాలు, మల్లికాగుండంలోని శుద్ధజలంతోనూ అభిషేకం నిర్వహించారు. నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



రుద్రవరం అమ్మవారిశాల సెంటర్లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

రుద్రవరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని ఎంపీడీఓ భాగ్యలక్ష్మి సూచించారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా శనివారం వివిధ శాఖలకు చెందిన అధికారులు కలిసి పరిశుభ్రతపై మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. అమ్మవారిశాల సెంటర్లో మానవ హారంగా ఏర్పడి పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటామంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వాయు కాలుష్య నివారణకు పరిసరాల శుభ్రతతో పాటు పచ్చదనం కోసం మొక్కలు నాటి పెంచాలన్నారు.

చాగలమర్రి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమ నిర్వహించారు. క్లీన్ ఎయిర్, కార్ ఫ్రీ, బైక్ ఫ్రీ డేస్‌ను ప్రోత్సహించేందుకు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ తాహెర్ హుస్సేన్, ప్రత్యేక అధికారి జగ్గయ్య ఆధ్వర్యంలో విద్యార్థులచేత సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ సర్కిల్ వద్ద స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరుల పాల్గొన్నారు.

వాహనాలపైకి దూసుకెళ్లిన తుఫాన్

- దెబ్బతిన్న మూడు వాహనాలు
- స్కూటరిస్టుకు గాయాలు



బైక్‌ను ఢీకొని ఆగిన తుఫాన్



దెబ్బతిన్న కారు

బేతంచెర్ల: మండల పరిధిలోని మద్దిలేటి నరసింహ స్వామి ఆలయ సమీపంలో శనివారం తుఫాన్ వాహనం ఎదురుగా వస్తున్న మూడు వాహనాలను ఢీకొట్టింది. వివరాలు.. ఆర్ఎస్ రంగాపురం గ్రామం నుంచి ఆలయానికి వెళ్తున్న తుఫాన్ వాహనాన్ని డ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ ఎదురుగా వస్తున్న ఆటో, కారు, బైక్‌ను ఢీకొట్టడంతో మూడు వాహనాలు దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ఉన్న బేతంచెర్ల బోయపేటకు చెందిన మహేంద్ర అనే యువకుడికి గాయాలయ్యాయి. మిగిలిన ఎవరికీ గాయాలు కాలేదు. కారు, ద్విచక్ర వాహనంతో పాటు తుఫాన్ వాహనం దెబ్బతింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కారణాలను తెలుసుకున్నారు.

వేలంలో రూ.23వేల ఆదాయం

డోన్ టౌన్: జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు శనివారం డోన్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన ఆరు ద్విచక్ర వాహనాలను వేలం ద్వారా విక్రయించారు. ఈ వేలం ద్వారా రూ.20 వేల ఆదాయం లభించగా, అదనంగా జీఎస్టీ రూ.3,600 వసూలు చేసి మొత్తం రూ.23,600 ఆదాయం వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మణదాసు, ఎస్ఐ సోమశేఖరరావు తెలిపారు.

వెండి తీర్థపు గిన్నె విరాళం

బనగానపల్లె: మండల పరిధిలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి దేవస్థానానికి వైఎస్సార్ జిల్లా బద్వేల్‌కు చెందిన దాతలు పొన్నపోలు గోవర్ధన్ రెడ్డి, సాహిత్యరెడ్డి శనివారం రూ.45 వేల విలువ చేసే 240 గ్రాముల వెండి తీర్థపు గిన్నె మరియు ఉద్ధరిణను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, పూజారులు ప్రత్యేక పూజలు చేయించి దాతలకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ద్విచక్రవాహనాలు ధ్వంసం

డోన్ టౌన్: పట్టణంలో ఇళ్ల ముందు పార్కు చేసిన బైక్‌లనే లక్ష్యంగా చేసుకుని రాత్రి వేళల్లో గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేస్తున్నారు. శుక్రవారం రాత్రి శ్రీరామనగర్‌లో నాలుగు బైక్‌ల హెడ్ లైట్స్, సైడ్ డూమ్‌లను దుండగులు ధ్వంసం చేసినట్లు స్థానికులు తెలిపారు. శ్రీనివాసనగర్‌లోనూ ఇలాంటి ఘటన చోటు చేసుకున్నట్లు కాలనీవాసులు వాపోయారు. ఈ ఘటనలపై పట్టణ పోలీసులను వివరణ కోరగా తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాలు అందలేదని సమాధానం ఇచ్చారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ఉయ్యాలవాడలో మానవహారం నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

ఉయ్యాలవాడ: ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, తహసీల్దార్ ప్రసాద్‌బాబు సూచించారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక మోడల్‌స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి బస్టాండు మీదుగా పోలీస్ స్టేషన్ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో అధికారులు, విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ కవర్లు నిషేధానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయకుమార్, ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు నరసింహారావు, ఫణీత్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలికల చదువు సమాజానికి వెలుగు



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

గోస్పాడు: బాలికల చదువు సమాజానికి వెలుగు లాంటిదని, ప్రతి ఒక్కరూ చదువుకోవాలని ఎంఈఓ అబ్దుల్‌కరీం, ఈఓఆర్‌డీ నాగ అనసూయ అన్నారు. స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలలో శనివారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాల్య వివాహాలను నిరోధించాలని, అలాంటి పరిస్థితులు ఎదురైతే అందుబాటులో ఉన్న టీచర్లను, 1098 టోల్‌ఫ్రీకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. అనంతరం వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో విజేతలైన బాలికలకు బహుమతులు ప్రదానం చేశారు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

నంద్యాల(అర్బన్): పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, మనం పని చేసే ప్రదేశం, నివసించే ప్రాంతం శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం బాగుంటుందని తెలుగుగంగ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దశరథరామిరెడ్డి తెలిపారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక కార్యాలయ ఆవరణలో శనివారం సిబ్బందితో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. అలాగే.. మండలంలోని మిట్నాల గ్రామంలో జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడటం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చన్నారు. మాజీ ఎంపీటీసీ మహేశ్వరరెడ్డి, సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, వీఓఏల సంఘం కార్యదర్శి తిరుపతయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

నంద్యాల(న్యూటౌన్): విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా నూతన అధ్యక్షుడు పూజారి ఎర్రిస్వామి పేర్కొన్నారు. శనివారం జిల్లా అధ్యక్షుడి ఎన్నికను స్థానిక కార్యాలయంలో నిర్వహించారు.తనపై నమ్మకంతో నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకోవడం గర్వంగా ఉందన్నారు.

నూతన ఉపాధ్యాయులకు ఎస్ఆర్‌ల పంపిణీ



ఎస్ఆర్‌లు అందజేస్తున్న ఎంఈఓ-1 అనురాధ

చాగలమర్రి: మండలంలోని నూతన ఉపాధ్యాయులకు ఎస్ఆర్(సర్వీస్ రిజిస్టర్లు)లు అందజేసినట్లు ఎంఈఓ-1 అనురాధ తెలిపారు. శనివారం భోజన విరామ సమయంలో పెద్దబోదనం, చింతలచెరువు, చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలలో ఎంఈఓ అనురాధ, హెచ్‌ఎంలు జీవయ్య, కాత్యాయిని, సుధాకర్‌గుప్తా నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ రవీంద్రారెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మౌలాలి, ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాపై అవగాహన



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

దొర్నిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు విద్యుత్ వినియోగంపై శనివారం అవగాహన కల్పించారు. ఇండస్ట్రీయల్ విజిట్ కార్యక్రమంలో భాగంగా స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈసందర్భంగా విద్యుత్ లైన్‌మెన్లు గోపాల్‌రెడ్డి, నాగయ్య విద్యుత్ సరఫరా, వాటి ప్రయోజనాలు, గ్రామాలకు విద్యుత్ సరఫరా చేసే విధానంపై వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చెన్నకేశ్వరి, ఆపరేటర్స్ వెంకటసుబ్బయ్య, శివ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

కోవెలకుంట్ల: పట్టణంలోని స్వామినగర్ కాలనీకి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఎస్ఐ సమాచారం మేరకు.. స్వామినగర్ కాలనీకి చెందిన మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి రెండు రోజుల క్రితం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, ఇతర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆమె భర్త నరసింహ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు శనివారం అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

డోన్ టౌన్: ఉన్నతి ఫౌండేషన్ సంస్థ నిరుద్యోగులకు బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో 35 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ అడ్మిషన్స్ కో-ఆర్డినేటర్ హరిప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి సౌకర్యంతో పాటు ఉద్యోగావకాలు కూడా కల్పిస్తామని పేర్కొన్నారు. 18 నుంచి 28 ఏళ్ల వయసు, కనీసం 10వ తరగతి అపై చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 90004 87423 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాబోయ్.. పొడగరి!



దొర్నిపాడులో ఓ టాల్‌మేన్ శనివారం నడుచుకుంటూ వెళ్తూ అందరినీ ఆకట్టుకున్నాడు. ఓ ఫెస్టిసైడ్ కంపెనీ ప్రచారంలో భాగంగా ఆ వ్యక్తి వెళ్తూ కనిపించాడు. సుమారు 10 అడుగులకు పైగా కాళ్లకు కట్టెలు కట్టుకుని, పొడవాటి టోపీతో గులాబీ రంగు దుస్తులు ధరించి నడుస్తుండంతో స్థానికులంతా ఆశ్చర్యంగా చూశారు. - దొర్నిపాడు